
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 3 జూన్ 2024



యాచారంలో మోస్తరు వర్షం



యాచారం, జూన్ 2 : యాచారం, నందివనపర్తి, చౌదర్‌పల్లి, గున్‌గల్, మాల్, తమ్మలోనిగూడ గ్రామాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. వర్షం రాకతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ సరఫరా లేక జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంలో విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా ఆయా గ్రామాల్లోని 33/11కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేసి ఫలితమేంటని అధికారుల తీరుపై వినియోగదారులు మండిపడుతున్నారు.

- ఉద్యోగులు అంకిత భావం, నీతి నిజాయితీలతో పనిచేయాలి
- జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలి
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో జిల్లా కలెక్టర్ శశాంక
- ఇండోర్ స్టేడియంలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద శ్రద్ధాంజలి

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

దశాబ్దాల పాటు కొనసాగిన తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం, ఉద్యమాల్లో భాగమైన అమరుల, ఉద్యమకారుల త్యాగాలు, నిబద్ధత వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పదో ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. 1969 నుంచి అలుపెరుగని పోరాటం చేస్తే తెలంగాణ రాష్ట్ర సాధన కల సాకారమైందన్నారు. ఉద్యమంలో జిల్లా వాసులు కీలక భూమిక పోషించారన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజాసేవ, సమాజాభివృద్ధే ధ్యేయంగా ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అమరవీరుల స్మారక స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.



వేడుకల్లో విద్యార్థినుల నృత్యం



కలెక్టరేట్ వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన కలెక్టర్ శశాంక

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 2): అమరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ శశాంకకు పోలీసులు గౌరవ వందనంతో జిల్లా యంత్రాంగం తరఫున ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. అమరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు, రాష్ట్రసాధన ఉద్యమంలో పాలుపంచుకున్న అందరికీ ఆయన పేరుపేరునా నమస్కరించారు. అమర వీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోందని తెలిపారు. సమైఖ్య రాష్ట్రంలో తెలంగాణ అణచివేతకు, దోపిడీకి గురైందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితేనే తప్ప మన రాతలు మారవనే వాస్తవాన్ని గ్రహించి 1969 జనవరి 5 నుంచి అలుపెరుగని పోరాటం చేస్తే ఆరు దశాబ్దాలకుపైగా చేసిన పోరాటాలతో, ఎన్నో కీలక ఘట్టాలు, మరెన్నో మైలురాళ్లు దాటుతూ 2014 జూన్ 2న స్వరాష్ట్రం సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమంతో మన ఉమ్మడి జిల్లాకు విడదీయరాని అనుబంధం ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. మన జిల్లా వాసులు ఎంతో మంది రాష్ట్రం కోసం ఆత్మబలిదానాలు చేశారని తెలిపారు. వారి ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివన్నారు. తెలంగాణ సాధనకు తొలిదశ, మలి దశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమర వీరులందరినీ ఈ సందర్భంగా స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు.

అంకిత భావంతో పనిచేయాలి

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఉద్యోగులు, ఇతర సిబ్బంది అంకితభావంతో, నీతినిజాయితీ, నిస్వార్థంగా పారదర్శకంగా పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని ఆయన కోరారు. జిల్లాలోని అన్ని సామాజికవర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ, సమగ్రాభివృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలకే పెద్దపీట వేస్తుందన్నారు. పాలనలో పారదర్శకతతో పాటు ప్రజలకు జవాబుదారీగా ఉండే వాతావరణాన్ని నెలకొల్పుతున్నట్లు శశాంక చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 5.63కోట్ల మహిళలు ఉచితంగా ప్రయాణించారని చెప్పారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా జిల్లాలో డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 2,726 మంది ఆరోగ్యశ్రీ వైద్య సేవలను పొందారని చెప్పారు. రూ.90.8లక్షలను ప్రభుత్వం వైద్య సేవలకు ఖర్చు చేసిందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 4,29,722 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు.

వ్యవసాయ పురోగతికి ప్రణాళిక

రైతుల సంక్షేమానికి, వ్యవసాయ పురోగతికి అవసరమైన ప్రణాళికను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 2023-24 యాసంగి పంట పెట్టుబడి కింద 3,25,216 మంది రైతుల ఖాతాల్లో 343.1కోట్లను జమచేశామని చెప్పారు.

పాఠశాలలు ప్రారంభానికి ముందే బడి బాట

పాఠశాలల ప్రారంభానికి ముందే జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమ నిర్వహణకు యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. బడిలో చదివే పిల్లల తల్లుల భాగస్వామ్యాన్ని పెంచటం ద్వారా విద్యార్థుల నమోదు శాతం పెరిగే దిశగా అడుగులు వేస్తుంది. పాఠశాలల్లో అవసరమైన పనులన్నీ గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలతో చేయిస్తోందన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతను అందించే దిశగా విద్యార్థులకు యూనిఫామ్‌లను కుట్టించే పనులను వారికే అప్పగించామని కలెక్టర్ పేర్కొన్నారు.

యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు

జిల్లాలో యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చేందుకు టాటా టెక్నాలజీస్ కంపెనీ భాగస్వామ్యంతో వర్క్‌షాపులు నెలకొల్పి, అడ్వాన్స్ స్కిల్ సెంటర్‌ను షాద్‌నగర్‌లో ప్రారంభించామన్నారు. 2024-25విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులను ప్రారంభిస్తామని తెలిపారు.

కుల వృత్తులకు ప్రోత్సాహమే లక్ష్యంగా విశ్వకర్మ పథకం

జిల్లాలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సంప్రదాయ వృత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ప్రారంభించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 150 మంది వివిధ చేతి వృత్తి దారులను ఈ పథకం కింద ఎంపిక చేశామని, వారికి తగిన ఆర్థిక చేయూతతో పాటు వృత్తిలో నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు.



వేడుకలకు హాజరైన ప్రజలు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

పెరిగిన పోలింగ్ శాతం

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 2,877 పోలింగ్ కేంద్రాల్లో 29,38,370 మంది ఓటర్లు నమోదు కాగా వారిలో 56.40శాతం మంది ఓటు వేశారని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలో కొత్తగా 5లక్షల మంది ఓటర్లుగా నమోదవగా 2019లో పార్లమెంటు ఎన్నికలతో పోల్చితే ఈ సారి 3,58,000 మంది అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ 3.21శాతం పెరిగిందన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆమన్‌గల్‌లోని కస్తూర్బా బాలికలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాంస్కృతిక కార్యమంలో ప్రతిభను చాటిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

టెన్త్, ఇంటర్‌లలో ఉత్తమ ఫలితాలు

జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు 50,948 మంది విద్యార్థులు హాజరు కాగా 46,245 మంది పాసైనటు, ఉత్తీర్ణత శాతం 90.77 నమోదైందని తెలిపారు. జిల్లాలో 1,371 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారన్నారు. అలాగే 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో 71.1శాతంతో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 77.63శాతంతో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు.



విద్యార్థుల సైనిక విన్యాసం

ప్రతీ నియోజకవర్గంలో మోడల్ పోలింగ్ కేంద్రాలు

పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం నియమాలను అనుసరిస్తూ ప్రతి నియోజకవర్గానికి మహిళ సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఐదు చొప్పున మోడల్ పోలింగ్ స్టేషన్లను నిర్వహించామన్నారు. పీడబ్ల్యూడీ ద్వారా నియోజకవర్గ సెగ్మెంట్‌లో ఒక్కో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. యువతను ఆకర్షించేలా 'యువ' పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి మండలానికి మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లకు వీకె రన్, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ఓటర్ అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు.

అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన కలెక్టర్

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద కలెక్టర్ శశాంక పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అమరవీరుల త్యాగాల పునాదులపై, పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రగతిలో అన్ని వర్గాలు మమేకం కావాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో రాచకొండ డీసీపీ అరవింద్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

అధికారులపై కలెక్టర్ సీరియస్!

ఆవిర్భావ వేడుకల్లో భాగంగా కలెక్టర్ శశాంక ప్రసంగిస్తున్న సమయంలో తరచూ మైక్ మొరాయించడం, నిర్దేశిత సమయానికి సాంస్కృతిక కార్యక్రమాలు మొదలు పెట్టకపోవడంపై కలెక్టర్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నిర్వహన ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులపై సీరియస్ అయ్యారు. కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించేశారు. దీంతో ముఖానికి రంగులు అద్దుకుని, సంప్రదాయ వస్త్రాధారణలో నృత్యాలను ప్రదర్శించేందుకు వచ్చిన ప్రభుత్వ శిశువిహార్ చిన్నారులకు నిరాశే మిగిలింది.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

ఆమనగల్లు, జూన్ 2 : ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ తెలిపారు. ప్రైవేట్‌కు ధీటుగా కళాశాలలో బోధన సాగిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ప్రచారం చేపడుతున్నారు. పట్టణంలో తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ కాలేజీలో పుస్తకాలు ఇస్తారని, అలాగే స్కాలర్‌షిప్ కూడా వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఎరువులు, విత్తనాల కొరత సృష్టించొద్దు

చేవెళ్ల, జూన్ 2 : ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించొద్దని చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్లలోని రైతు వేదికలో డీలర్లు, రైతులతో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల అమ్మకాలు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాకింగ్ చేయకుండా లూజు విత్తనాలు అమ్మొద్దని సూచించారు. అనుమతి పొందిన కంపెనీల విత్తనాలే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాదారులు అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తులసి, ఏఈవోలు రమేష్, స్వాతి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు సిద్ధం

రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని కందుకూరు ప్యాక్స్ చైర్మన్ సంఘం అధ్యక్షుడు దేవరశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కందుకూరు సొసైటీ కార్యాలయంలో ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఏపీ బస్తాకు రూ.1,350, 20-20 బస్తాకు రూ.1,200, యూరియా బస్తా రూ.267కు విక్రయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాండురంగారెడ్డి, ఆనంద్, సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



విత్తన డీలర్లతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి



కల్యాణం జరిపిస్తున్న పూజారులు

ఘనంగా రంగనాయక స్వామి కల్యాణం

ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారు రంగధాంలలో ఆదివారం గోదా సమేత రంగనాయకస్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణంలో ఈవో శివకుమార్, అర్చకులు, ధర్మకర్త వేశవాచార్యులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.బాబయ్య, సంఘమేశ్వర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్, జూన్ 2

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

మేడ్చల్ టౌన్, జూన్ 2: జిల్లా బీజేపీ నాయకుడు రామన్న గారి శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పంపిణీ చేశారు. మండలంలోని వృద్ధాప్య, అనాథాశ్రమంలో పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు మైసరి రాజు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

దోమ, జూన్ 2: మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో మైసమ్మ దేవత నూతన ఆలయం పూజా కార్యక్రమాల్లో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామదేవతను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు.



శివారెడ్డిపల్లిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ గిరి

యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలి

పెద్దేముల్, జూన్ 2: సమాజంలో యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలని పెద్దేముల్ ఎస్ఐ గిరి అన్నారు. మండల కేంద్రంలో అల్లెంకల అశోక్ కుమార్ ప్రీమియర్ లీగ్ 3 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా పెద్దేముల్ ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి టోర్నమెంట్లను క్రీడాకారులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు అల్లెంకల అఖిల్, ప్రశాంత్, వెంకటేష్‌గౌడ్, డీవై ప్రసాద్, ఆర్గనైజర్స్ మాదవ్‌రెడ్డి, వెంకటేష్, చిన్నా, అశోక్, చందు, సిద్దు, భాను చరణ్, ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్



- ఒక వైపు ఎన్నికల ఫలితాలు
- మరోవైపు విద్యాసంవత్సరం ప్రారంభంతో ఫీజుల టెన్షన్
- సాగు పనుల్లో పెట్టుబడికి రైతుల టెన్షన్

తాండూరు, జూన్ 2: జూన్ నెల ఆరంభమైయిందంటే హడలే. రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మరోవైపు పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో రాజకీయ వర్గాలలో టెన్షన్ మొదలైంది. జూన్ నెలంటే ఖర్చు వద్దని పల్లెటూరి ప్రజలు అంటుంటారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఎక్కువ టెన్షన్ ఎందుకంటే పిల్లలకు పుస్తకాలు, యూనీఫాం, బ్యాగ్‌లు, షూ, ఫీజులు చెల్లింపు, టై వంటి కొనుగోలుతో పాటు పలు రకాల ఖర్చులు ఉంటాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పదు. ఇదిలా ఉంటే ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న ఉంది. బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీ నాయకులు, ప్రజల్లో టెన్షన్ నెలకొంది. ఫలితాలు ఎవరికి అనుకూలం? ఎవరికి వ్యతిరేకంగా ఉంటాయో? అన్న ఉత్కంఠ అందరిలో ఉంది. ఎక్కడ చూసినా పోలింగ్ సరళిపై చర్చ సాగుతోంది. దేశవ్యాప్తంగా విలువడే ఫలితాలపై బెట్టింగులు కడుతున్నారు. మరోవైపు రైతుల సీజన్ ప్రారంభమైంది. పొలాల్లో దుక్కులు దున్ని ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్నారు. ఎరువుల, విత్తనాలు కొనుగోలు, కూలీలు, ట్రాక్టర్లు, పెద్ద నాగళ్ల, వేయించడం వంటికి పెట్టుబడుల టెన్షన్, ప్రధానంగా పెట్టుబడుల కోసం ఆడ్తిదారులు, బ్యాంకులకు రైతులు వెళ్లి తయారు చేసుకుంటున్నారు. జూన్ నుంచి రైతులకు ఏడాది పాటు పెట్టుబడులు అవసరమవుతాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పిల్లల చదువుల కోసం పట్టణాలకు వచ్చి ఇంటి అద్దె తీసుకొని ఉంటున్నారు. ఇది కూడా కుటుంబాలకు భారమవుతోంది.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రశాంత్

కంప్యూటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందజేత

కొడంగల్, జూన్ 2: కొడంగల్‌లోని వీబీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో ఆదివారం విద్యార్థులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, రిటైర్డ్ టీచర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా నిర్వాహకుడు భీమారాజ్ అందజేశారు.

కొడంగల్ రూరల్: సంగాయిపల్లిలో దివంగత శివమ్మ, అచ్చప్ప స్మారకార్థం ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో ఇంగ్లీష్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు పూర్తి చేసిన వారికి సోమవారం ఉదయం 10గంటలకు ధ్రువపత్రాలు అందించనున్నట్లు నిర్వాహకులు హన్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ సీఐ కె.శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



శ్రీధర్‌రావు, సుధీర్‌మోహన్‌లను సన్మానిస్తున్న గ్రామస్థులు

షాబాద్, జూన్ 2: ప్రతీ ఒక్కరు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని చందన్‌వెళ్లిలో గ్రామానికి చెందిన శ్రీధర్‌రావు, సుధీర్ మోహన్‌లు గ్రామంలో 6 సీసీ కెమెరాలు, మానిటర్లను అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల స్వామి మాట్లాడుతూ సమాజ సేవ చేయడంలో ఉన్న తృప్తి మరెక్కడా ఉండదని, ప్రతీ ఒక్కరు తమ వంతుగా గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, గ్రామస్తులు రాఘవాచారి, యాదయ్య, గోపాల్, కిష్టయ్య, వెంకటేష్, నరేష్, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వైభవంగా బీరప్ప జాతర

యాలాల, జూన్ 2: మండలంలోని జక్కేపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో నిర్వహించిన బీరప్ప జాతర ఉత్సవాల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కేపల్లి అమృతయ్య, మొగులయ్య, షైపాల్, బీమప్ప, మాజీ ఎంపీటీసీ రాజు, యాదిరెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

తాండూరు: తాండూరు పట్టణంలో ఎస్.ఎస్.డ్యాన్స్, ఫిట్నెస్ స్టూడియో ఆధ్వర్యంలో నిర్వహిచిన నృత్య ప్రదర్శన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నృత్యకారులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ రమేష్, స్థానిక కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

తాగునీరు వృథా



దోమ, జూన్ 2: మండలంలోని దోర్నాల్‌పల్లిలో తాగునీటి ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. తాగునీటికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారే లేరా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని వివిధ గ్రామాల్లో వృథాగా వెళ్తున్న నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జనగాంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవం

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

పెద్దేముల్, జూన్ 2: జనగాంలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జనగాంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో హోమాలు నిర్వహించి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం చేశారు.



వర్షకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆలయ అభివృద్ధికి మొదటి నెల వేతనం విరాళం

యాచారం, జూన్ 2: తనకు ఉద్యోగం వస్తే మొదటి నెల వేతనం ఆలయ అభివృద్ధికి ఇస్తానని మొక్కుకున్న యువతి కొలువు సాధించింది. ఈమేరకు తన కోరిక నెరవేరడంతో మొదటి నెల వేతనం ఆదివారం ఆలయ ఆలయ నిర్వాహకులకు అందించింది. నందివనపర్తికి చెందిన కొండూరి వర్ష కొంత కాలంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం యత్నించింది. ఉద్యోగం వస్తే మొదటి నెల వేతనం జ్ఞానసరస్వతీ మాత ఆలయ అభివృద్ధికి ఇస్తానని మొక్కుకుంది. నెల క్రితం ఇన్‌వోలేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో ఉద్యోగం వచ్చింది. దాంతో ఆదివారం ఆమె కుటుంబ సభ్యులతో వచ్చి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొదటి నెల వేతనం రూ.41,735 వేతనం విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందించింది. ఆమెను ఆలయ నిర్వాహకులు అభినందించి జ్ఞాపికగా అమ్మవారి ఫొటోను అందజేశారు.

నవీన్‌రెడ్డి విజయం పట్ల బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

- ఆమనగల్లు, కడ్తాలలో ర్యాలీలు
- బాణసంచా పేల్చి మిఠాయిల పంపిణీ



కొత్తూర్‌లో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్/కొత్తూర్/చౌదరిగూడ, జూన్ 2: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ రెడ్డి విజయం పట్ల బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాలలో ఆదివారం ఫలితాలు వెలువడగానే అ పార్టీ నాయకులు పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్ రెడ్డిలకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆయా మండల కేంద్రాలలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు గు రి చేసినా బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు జట్టుకట్టి పార్టీ అభ్యర్థిని గెలిపించారన్నారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరామ్ నాయక్, కుమార్, మంజుల చంద్రమౌళి, ప్రియ రమేశ్, సరితపంతూనాయక్, కౌన్సిలర్ రాధమ్మవెంకటయ్య, నాయకులు జోగువీరయ్య, హరిచంద్ నాయక్, సేవ్యానాయక్, వెంకటయ్య, రమేశ్, అల్లాజీ, సైదులుగౌడ్, దోనాదుల సత్యం, గన్యానాయక్, అంజి, లాయక్‌అలీ, మంగళపల్లి నర్సింహ, సయ్యద్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్‌లో నవీన్‌రెడ్డికి ఘనస్వాగతం

ఎమ్మెల్సీగా గెలుపొంది బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలుసుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని కొత్తూర్ వద్ద ఆ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆయన కొత్తూర్‌కు చేరుకోగానే శాలువాలు, పూలమాలతో సన్మానించారు. చౌరస్తాలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి నవీన్‌కుమార్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ, బి.దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, జె. శ్రీను, సోమ్లానాయక్, గోపాల్‌గౌడ్, శివచారి, రవినాయక్ తదితరులు స్వాగతం పలికారు. కాగా, నవీన్‌రెడ్డి గెలుపుపట్ల చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్లలో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎల్కిచర్లలో టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపుపై సంబురాలు

నవాబుపేట, జూన్ 2: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందడం పట్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ టపాసులు పేల్చారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తలకొండపల్లి, జూన్ 2: మండల పరిధిలోని గట్టిప్పలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన సమ్మేళనంలో బాల్యమిత్రులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిద ప్రాంతాలు, వివిద హోదాలలో ఉన్న ఏళ్ల తర్వాత కలుసుకొని పూర్వ విద్యార్థులంతా కలుసుకొని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం కు ఆటా పాటలతో ఉత్సాహంగా , ఉల్లాసంగా గడిపారు. తమ ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మొకురాల అశోక్‌గౌడ్, ఖలీం, ఏదుల మహేశ్, రమేశ్, సక్రు, రవి, భాను, రమేశ్, నాగజ్యోతి, శ్రావణి,శ్రీలత, మమత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పట్టు సడలని బీఆర్ఎస్

- మహబూబ్‌నగర్ స్థానిక ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డి విజయం

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు/కొత్తూర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి నాగరకుంట నవీన్‌రెడ్డి విజయం సాధించారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై ఆయన 111 ఓట్లతో గెలుపొందారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో పనిచేసింది. పైగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా సైతం ఉమ్మడి మహబూబ్‌నగరే కావడంతో ఈ ఉప ఎన్నికను గెలిచేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఓటమితో కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ తగిలింది. గత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన బీఆర్ఎస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్‌లో చేరి 2023 ఎన్నికల్లో కల్వకుర్తి అసెంబ్లీ స్థానం నుంచి గెలిచారు. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైన ఏడాదిన్నరకే రాజీనామా చేయడంతో ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆలంపూర్, గద్వాల మినహా 12 చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. కొడంగల్ నుంచి ఎన్నికైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్‌కు చెందిన చాలామంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. అయినా కాంగ్రెస్‌కు ఓట్ల సంఖ్య తక్కువ ఉన్నా 12మంది ఎమ్మెల్యేలు, సీఎం జిల్లా కావడంతో కాంగ్రెస్ మద్దతిచ్చే అభ్యర్థి గెలువాలన్న సంకల్పంతో ఆర్థికంగా ఉన్న మన్నె జీవన్‌రెడ్డిని బరిలో దింపారు. బీఆర్ఎస్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్‌గా పనిచేసిన నాగరకుంట నవీన్‌రెడ్డిని నిలిపింది. సీటు గెలువాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ క్యాంప్ రాజకీయాలు నిర్వహించాయి. అధికార బలం, ఎమ్మెల్యేల అండ, ఆర్థిక పరిపుష్టి ఉన్న జీవన్‌రెడ్డి విజయం ఖాయం అని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేసేది. ఓటర్లు, ఆర్థిక బలం ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డి సైతం విజయంపై ధీమాగానే ఉన్నారు. ఎంతగా ప్రలోభపెట్టినా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మొదటి ప్రాధాన్య ఓటును బీఆర్ఎస్ అభ్యర్థికే వేశారు. బీజేపీ నేతలు సైతం బీఆర్ఎస్‌కే వేసినట్టు ఓటింగ్‌ను బట్టి తెలుస్తోంది. అధికారం, డబ్బు ప్రభావం కన్నా పార్టీకి కట్టుబడి ఓటు వేశారు.

వార్డు సభ్యుడి నుంచి ఎమ్మెల్సీ దాక..

ఉమ్మడి కొత్తూర్ మండలం మామిడిపల్లికి చెందిన నాగర్‌కుంట వెంకట్రామ్‌రెడ్డి, శోభారెడ్డిల చిన్న కుమారుడైన 41ఏళ్ల నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి చిన్న వయసులోనే గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా గెలిచి ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అ తర్వాత ఎన్నికల్లో ఆఆయన తన తల్లి శోభారెడ్డిని సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. 2014లో కాంగ్రెస్ టికెట్‌పై కొత్తూర్ జడ్పీటీసీగా గెలిచారు. అ తర్వాత టీఆర్ఎస్‌లో చేరి మహబూబ్‌నగర్ జడ్పీ వైస్‌చైర్మన్ అయ్యారు. పదవీ కాలం ముగిసిన తరువాత ఐదేళ్ల స్తబ్దుగా ఉండి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ రాకపోవడంతో షాద్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్నారు. తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. నవీన్‌రెడ్డి గెలుపుతో ఆయన స్వగ్రామం మామిడిపల్లిలో గ్రామస్తులు మిఠాయి పంచుకొని సంబరాలు చేసుకున్నారు.



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నవీన్‌రెడ్డి దంపతులు

నవీన్‌రెడ్డిని అభినందించిన కేసీఆర్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నాగరకుంట నవీన్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభినందించారు. ఎన్నిక ఫలితం రాగానే నవీన్‌రెడ్డి మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వెల్‌డన్ అంటూ కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కేటీఆర్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

అమరుల త్యాగం చిరస్మరణీయం

- అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం
- ప్రభుత్వ, పార్టీ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాల ఆవిష్కరణ


రంగారెడ్డి అర్బన్ : బీజేపీ ఆఫీసు వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి


రంగారెడ్డి అర్బన్ : జెండాకు వందనం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి


షాద్‌నగర్ అర్బన్ : జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్మన్ నరేందర్


షాద్‌నగర్ రూరల్ : రాయికల్ పాఠశాలలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు


చేవెళ్ల : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో ప్రత్యేకాధికారి, తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు


యాచారం : అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


శంషాబాద్ : మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్


మొయినాబాద్ రూరల్ : రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు


కేశంపేట : తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఆజంఅలీ


షాద్‌నగర్ అర్బన్ : తెలంగాణ తొలిదశ ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మహేశ్వరం : జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్లార్ తదితరులు


ఇబ్రహీంపట్నం : చెరువు కట్టపై అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు


ఆమనగల్లు : జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు


చౌదరిగూడ : వేడుకల్లో అధికారులు, నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర లక్ష్యాన్ని సాధించి, ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలపై త్రివర్ణ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించి, వందన సమర్పణ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపాలిటీపై చైర్మన్ కొందూటి నరేందర్, మండల పరిషత్ కార్యాలయంపై ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, ఆర్డీవో కార్యాలయంపై ఆర్డీవో వెంకటమాధవరావు, తహసీల్దార్ కార్యాలయంపై తహసీల్దార్ పార్థసారథి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై ఆయా అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులను, జర్నలిస్టులను, ఉద్యోగులను, ప్రజా సంఘాల నాయకులను ఎమ్మెల్యే సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య, కాంగ్రెస్ నాయకుడు నాగిళ్ళ గోపాల్‌గుప్త లాంటి వారు తొలిదశ, మలిదశ ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, జడ్పీటీసీ సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, విశాలశ్రవణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వి.నారాయణరెడ్డి, వై.యాదయ్యయాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం తదితరులున్నారు.

రంగారెడ్డి అర్బన్ : గాంధీ భవన్‌లోని డీసీసీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింపుల సత్యనారాయణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మైలారం సులోచన తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణ ఉద్యమంలో బీజేపీ కీలక పాత్ర పోషించిందని జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద జాతీయజెండాను ఆవిష్కరించారు. బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, బస్వ పాపయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత నందకిశోర్, యువమోర్చ జిల్లా అధ్యక్షుడు టీ. యాదిష్, మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.


ఆదిభట్ల : మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి, కమిషనర్ బాలకృష్ణ తదితరులు


మాడ్గుల : జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ పద్మ

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజా భవన్)లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఘనత సోనియాగాంధీదంటూ కొనియాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగు కార్యాచరణతో ముందుకు పోతుందని, ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ బర్ల మంగ జగదీశ్వర్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కృపేష్ జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో క్రాంతికిరణ్, ఎంపీవో లక్పతినాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీల వద్ద ప్రత్యేకాధిరులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఇబ్రహీంపట్నం చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి జెండావిష్కరణ చేశారు.

షాద్‌నగర్ రూరల్ : ఫరూక్‌నగర్ మండలంలోని రాయికల్, కొండన్నగూడ తదితర గ్రామాల్లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు జాతీయ జెండాలను ఎగుర వేశారు. అలాగే పలు గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు జెండాలను ఎగురవేశారు.

కేశంపేట : తెలంగాణ ఆవిర్భావ వేడుకలను కేశంపేటలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ రవీందర్ యాదవ్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఆజంఅలీ, ఎమ్మార్సీ వద్ద ఎంఈవో మనోహర్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై లింగం జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

కొత్తూర్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పార్టీల నాయకులు ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ నర్సింహారావులు జాతీయజెండాలు ఆవిష్కరించారు. ఎంపీడీవో అరుంధతి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులున్నారు.

చౌదరిగూడ : చౌదరిగూడ మండలం పరిధిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కొందుర్గు : మండలంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంపై ఎంపీపీ జంగయ్య, తహసీల్దార్ కార్యాలయంపై సర్వేయర్ ఆంజనేయలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పై మండల వైద్యాధికారి డాక్టర్ అమృతాజోసఫ్, మహిళా సమాఖ్య వద్ద కోశాధికారి అపర్ణ, శ్రీరంగాపూర్, చిన్న ఎల్కిచర్ల, అయోధ్యాపూర్‌తాండ గ్రామ పంచాయితీల వద్ద ప్రత్యేకాధికారి, ఎంపీడీవో డాక్టర్ ఆంజనేయలు, కొందుర్గు, తంగళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్ లోని గ్రామ పంచాయతీల వద్ద ప్రత్యేకాధికారి, ఎంపీవో లాలయ్య జెండా ఎగురవేశారు. వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్, ఎంపీటీసీ ఇస్తారమ్మ, బి.పెంటయ్య, బి.నరేందర్,పురుషోత్తంరెడ్డి, జంగయ్య, దర్శన్, బి.యాదయ్య, మాణయ్య, ఏపీవో నర్సింగ్‌రావు, ఏపీఎం జయమాలిని, రామకృష్ణ, కె.సుధాకర్, ఎస్.శ్రీనివాస్, ఆర్.సుందర్, కె.శ్రీశైలం, బి.శంకర్, దశరథ్, శివకుమార్‌గోపాల్ నాయక్, వినోద్ తదితరులున్నారు.

శంషాబాద్ : తెలంగాణ ఏర్పడ్డాకనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేశారు. మండల ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ ఎదుట ఏసీపీ కేఎస్ రావు జెండాను ఆవిష్కరించారు. ఎస్‌హెచ్‌వో బాలరాజుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నర్కూడలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తల సమక్షంలో జెండా ఎగురవేశారు. అమరవీరులకు నివాళులర్పించారు. శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నరేందర్‌రెడ్డి జెండా ఎగురవేశారు. కవ్వగూడ మాజీ సర్పంచ్ రమేష్‌యాదవ్, కుమార్, రవినాయక్, సీహెచ్ శేఖర్‌యాదవ్, అంజన్న,చింత లింగమయ్య, మల్లేష్‌యాదవ్, రఘు, దేవేందర్, ప్రవీణ్‌కుమార్, డీజే మహేష్, జగన్నాథం, రాజలింగం గౌడ్, పాండు, రాకేష్, టిల్లు, అజీజ్, ఆసిఫ్, వినోద్, భిక్షపతి, జంగారావు తదితరులున్నారు.

మహేశ్వరం : మండలంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద జెండాలను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునితఅంద్యానాయక్, ఈశ్వర్, రఘుపతి, జంగయ్య, రాజు, రాజునాయక్ తదితరులున్నారు.

షాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు షాబాద్ మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రశాంతి మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో అన్వర్, ఎంఈవో కార్యాలయంలో శంకర్ రాథోడ్, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో వెంకటేశం, విద్యుత్ కార్యాలయంలో ఏఈ నరేందర్, కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, జీపీల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాను ఎగరవేశారు. అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జెండాను ఎగురవేసి స్వీట్లు పంచి పెట్టి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు.

మొయినాబాద్ రూరల్ : తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు మండలంలోని గ్రామాల్లో పార్టీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో ఎంపీపీ నక్షత్రం జయవంత్, ఎంపీడీవో సంధ్యారాణిలు సిబ్బందితో కలిసి ఔజెండాను ఆవిష్కరించారు.

చేవెళ్ల : చేవెళ్ల జీపీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి తహసీల్దార్ కృష్ణయ్య జెండాను ఎగరవేసి అమరవీరులను స్మరించుకున్నారు. ఎంపీపీ విజయలక్ష్మీ రమణారెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, ఎంపీటీసీ రాములు గ్రామస్తులున్నారు. కందుకూరు మండలంలో కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి జెండాను ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, మల్లేష్, పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు కృష్ణానాయక్, అఫ్జల్‌బేగ్, సులేమాన్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిభట్ల : వేలాది మంది యువత బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ఫలాలు ప్రతీ ఇంటికి చేరాల్సిన అవసరం ఉందని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిభట్ల చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయంలో పాలక సభ్యులు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వైస్‌చైర్మన్ యాదగిరి కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ రాఘవేందర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పరమేష జెండాను ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు.

యాచారం : నగరంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరులకు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ట్యాంక్‌బండ్‌పై జరిగిన వేడుకల్లో పాల్గొని వాలంటీర్లుగా సేవలందించారు. సీనియర్ నాయకులు కె.నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లక్ష్మణ్, తిరుమల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కెయాదయ్య, రవీందర్, ఐలయ్య తదితరులున్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అయ్యప్ప, రైతు వేదిక వద్ద వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, పశుసంవర్ధక శాఖ భవనం వద్ద డాక్టర్ రేఖ, పోలీస్‌స్టేషన్‌పై సీఐ శంకర్‌కుమార్, ట్రాన్స్‌కో భవనం వద్ద ఏఈ సందీప్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఎంపీటీసీలు, పాఠశాలల్లో హెచ్‌ఎంలు జెండాలు ఎగుర వేశారు.

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మాడ్గుల : రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో ఆదివారం అంబురాన్నంటాయి. అన్ని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో వేడుకలు జరుపుకున్నారు. జాతీయ జెండాలను ఆవిష్కరించి అమర వీరుల స్థూపం, చిత్రపటాల వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించారు. గాంధీజీ, అంబేడ్కర్, తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు సోనియాగాంధీ, బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆమనగల్లు జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి స్వరూప, ఎంపీపీ అనితవిజయ్, వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, తహసీల్దార్ లలిత, సీఐ ప్రమోదర్ కుమార్, ఎస్సై బాల్‌రామ్‌నాయక్, కమిషనర్ వసంత, ఏఈ కృష్ణయ్య, ఎంఈవో సర్ధార్‌నాయక్, తదితరులున్నారు. కడ్తాల మండల కేంద్రంలో వేర్వేరుగా జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ కార్యదర్శి బీక్యనాయక్, మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, జహంగీర్‌బాబా, తదితరులున్నారు. ఆటా-2024 వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లిన రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ప్రవాస భారతీయులతో కలిసి వేడుకలు నిర్వహించారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు జరుపుకున్నారు. ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, జడ్పీటీసీ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, ఎస్సై శ్రీకాంత్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రంగారెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్, తదితరులున్నారు. మాడ్గుల మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ గౌరవరం పద్మ, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సునిల్, మండల కేంద్రంలోని మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహం వద్ద సూదిని వెంకట్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి కడ్తాల మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో వేడుకలు, సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, ఎంపీపీ కమ్లీతో కలిసి సోనియా చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.


తలకొండపల్లి : మండల పరిషత్ వద్ద వేడుకల్లో ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్


కడ్తాల : వేడుకల్లో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్


ఇబ్రహీంపట్నం : చౌరస్తాలో జెండా ఎగురవేసిన బీఆర్‌ఎస్ నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి


శంషాబాద్ రూరల్ : నర్కూడలో జాతీయ జెండా ఎగురవేస్తున్న గడ్డం శేఖర్‌యాదవ్


యాచారం : మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ చేస్తున్న ఎంపీపీ సుకన్య


కొత్తూర్ : ఎంపీడీవో ఆఫీసు వద్ద జెండా వందనం చేస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, అధికారులు


కొందుర్గు : అయోధ్యాపూర్ తండాలో జెండాకు వందనం చేస్తున్న ప్రత్యేకాధికారి ఆంజనేయులు


షాబాద్ : వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం

ఆమనగల్లు, జూన్ 2: చోరీల నియంత్రణ, నేర పరిశోధన సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడుతాయని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. ఒక్క సీసీ కెమెరాల వంద మంది పోలీసులతో సమానమని ఆయన అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని 15 వార్డు ఉదయ్ నగర్ కాలనీలో కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం స్థానిక ఎస్ఐ బాల్‌రామ్ నాయక్ తో కలిసి లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. కేసులను సత్వరంగా చేదించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయని ఎస్ఐ బాల్ రామ్ నాయక్ తెలిపారు. దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ఇళ్ల ఎదుట విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. కాలనీలో అన్ని వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రఘు, నాయకులు నాగయ్య, వెంకటయ్య, యాదగిరి, గుండాలు, నర్సింహ్మా, వెంకటేశ్, శ్రీకాంత్, సత్తయ్య, శ్రీను, కృష్ణయ్య, పాతకోట రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కిరాణా షాపులో చోరీ

- ఐదు లక్షల నగదు, తులం బంగారం అపహరణ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం, జూన్ 2: ఇబ్రహీంపట్నం టౌన్ మంచాల రోడ్డులో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఓ కిరాణా షాపులో చొరబడి లాకర్‌లో ఉన్న ఐదు లక్షల రూపాయల నగదు, తులం బంగారు నాణెం ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మంచాల రోడ్డులో గుద్దేటి నగేష్ కిరాణ షాపు నడుపుతున్నాడు. కాగా, షాపు పైనే వారు నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో శనివారం రాత్రి షాపు మూసిన తర్వాత ఇంటికి తాళం వేసి భార్య పద్మావతితో కలిసి నగరంలోని చంపాపేట్‌లో ఉంటున్న పిల్లల దగ్గరకు వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు వెనకాల డోరు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే షాపులోకి వెళ్లి చూడగా.. లాకర్ తాళాలు పగులగొట్టి ఐదు లక్షల రూపాయల నగదు, తులం బంగారు నాణెంను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పరిశీలించారు. ఈమేరకు ఘటనా స్థలాన్ని ఏసీపీ కేపీవీ రాజు పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారయ్య తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 27 పాడి పశువులు పట్టివేత

యాచారం, జూన్ 2 : నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని మల్లేపల్లి నుంచి జంటనగరాలకు అక్రమంగా తరలిస్తున్న 26 ఆవులు, ఎద్దులను ఆదివారం రాత్రి యాచారం పోలీసులు మాల్ చెక్ పోస్టు వద్ద పట్టుకున్నారు. జంట నగరాలకు చెందిన కొందరు ముస్లింలు నల్గొండ జిల్లా మల్లేపల్లిలో పాడిపశువులను కొనుగోలు చేసి రాత్రివేళ తరలించేందుకు యత్నించారు. ఈమేరకు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. రెండు డీసీఎంలలో 26 పశువులను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. నేడు(సోమవారం) ఉదయం నగరంలోని గోశాలకు తరలించనున్నట్లు పోలీసులు చెప్పారు. కాగా, డీసీఎంల డ్రైవర్లు పోలీసులను చూసి తప్పించుకుపోయారని పోలీసులు తెలిపారు. అదేవిధంగా ఆటో ట్రాలీలో ఎండీ రబ్బానీ అనే వ్యక్తి హైదరాబాద్‌కు ఓ ఎద్దును అక్రమంగా తరలిస్తుండగా మాల్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆదివారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. కానిస్టేబుల్ కృష్ణ ట్రక్కులో ఎద్దును గమనించి డ్రైవర్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో యాచారం పోలీస్‌స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేసి ఎద్దును నగరంలోని గోశాలకు తరలించారు.

ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం

- రూ.5లక్షల మేర ఆస్తి నష్టం

షాద్‌నగర్ రూరల్, జూన్ 2: పట్టణంలోని చటాన్‌పల్లి రోడ్డులో ఉన్న జేపీ ఫర్నిచర్ షాపులో ఆదివారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాంతో సెల్లార్‌లో కరెంట్ బోర్డు నుంచి మంటలు వచ్చి కింద ఉన్న బెడ్లు, ఫర్నీచర్‌పై పడి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో చుట్టుపక్కలవాళ్లు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. కాగా, అగ్నిప్రమాదంలో సుమారు రూ.5లక్షల విలువ గల ఫర్నీచర్ కాలిపోయిందని బాధితుడు రహీం తెలిపాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా అతడు కోరాడు.

ఆలయ భూముల బహిరంగ వేలం

కేశంపేట, జూన్ 2: మండల పరిధిలోని నిర్దవెల్లి, కొండారెడ్డిపల్లిలోని ఆలయ భూముల వేలాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో రామశర్మ ఆదివారం తెలిపారు. నిర్దవెల్లిలోని బాలాజీస్వామి ఆలయానికి సంబంధించిన వ్యవసాయ భూ ములు 22 ఎకరాల 32గుంటలకు ఈ నెల 5న(బుధవారం), పోమాల్‌పల్లి- కొండారెడ్డిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు 8ఎకరాల 15గుంటలకు ఈ నెల 7న(శుక్రవారం) వేలం నిర్వహిస్తామని ఈవో తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10గంటలకు వేలం ఉంటుందని, కౌలు కాలం రెండేళ్లని వివరించారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేల డిపాజిట్ చేయాలని ఆయన సూచించారు.

మృతుల కుంటుంబాలకు ఆర్థిక సాయం

కేశంపేట/తలకొండపల్లి, జూన్ 2: కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన కందన వెంకటయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బీస కరుణాకర్ రెడ్డి ఆదివారం మృతుని కుటుంబానికి రూ.5,500 నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. భీమయ్య, శేఖర్, వెంకట్ రెడ్డి, రాఘవేందర్, నిరంజన్, చంద్రయ్య, లక్ష్మయ్య, మల్లయ్య, సుభాన్‌రెడ్డి, రాంరెడ్డి, ఆంజనేయులు, రాములు, చందర్ ఉన్నారు. తలకొండపల్లి మండలం పెద్దూర్ తండాకు చెందిన సభావట్ కిరణ్ మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. రూ.4వేలు శ్రీనివాస్ రెడ్డి సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీను, రవీందర్, చందు, సురేందర్, నరేందర్, పవన్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ కళలకు జీవం పోయాలి

తలకొండపల్లి, జూన్ 2:అంతరించిపోతున్న గ్రామీణ కళలకు జీవం పోసి భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైన ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కవులు, కళాకారులకు ప్రభుత్వాలు చేయూతనందించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో శ్రీ మల్లిఖార్జున స్వామి వీధి నాటక ప్రదర్శన కళాకారులకు అబినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నాటక కళాకారులను సత్కరించి అభినందించారు. ప్రోత్సహకంగా రూ. 5 వేలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్య కార్యక్రమాలలో కవులు, కళాకారుల పాత్రే కీలకమని ఆయన అన్నారు. ప్రజా జీవనంలో గ్రామీణ కళలకు ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుడ్డు మల్లేశ్, యాదయ్య, శ్రీకాంత్, మల్లయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.